# మౌసలపర్వ కథాంశాలు

ఇందు ఉప పర్వములు లేవు. ఈ పర్వమున ఎనిమిది అధ్యాయములు గలవు. 290 శ్లోకాలు వున్నాయి.

**ప్రథమ అధ్యాయము:- ఋషులశాపముచే సాంబుని గర్భము నుండి రోకలి పుట్టుట:-**

మహా భారత యుద్ధము తరువాత ముప్పదియారవ సంవత్సరము ప్రారంభమైనప్పుడు యుధిష్ఠిరుడు తన రాజ్యమున ఎన్నో అపశకునములను చూచెను. భయంకర మేఘగర్జనలతో రాళ్ళ వర్షముతో కూడిన పెను తుఫాను చెలరేగినది. ఆకాశము నుండి భూమి మీదకు నిప్పులు కక్కుచు ఉల్కలు పడినవి. సూర్యమండలము దుమ్ముతో కప్పబడినది. ఉదయకాలమున సూర్యుడు తేజోహీనముగ కనిపించసాగెను. కొన్ని రోజుల తరువాత యుధిష్ఠిరునికి ముసలము నిమిత్తముగా వృష్ణివంశీయులలో ఘోరయుద్ధము జరిగి వారందరు నాశము చెందిరని సమాచారమందెను. ఈ వార్త విని పాండవులందరు మిక్కిలి దుఃఖించిరి. శ్రీ కృష్ణుని పరలోకగమనమును వారు విశ్వసించలేక పోయిరి. జనమేజయుడు అడుగగా వైశంపాయనుడు యాదవుల కలహ వృత్తాంతమును సంపూర్ణముగా చెప్పెను. అతడు జనమేజయునితో రాజా! ఒక రోజున విశ్వామిత్ర కణ్వ నారదులు శ్రీ కృష్ణుని చూచుటకు ద్వారకకు వెళ్ళిరి. ఆ సమయమున కొంతమంది యాదవులు శ్రీ కృష్ణుని పుత్రులలో ఒకడైన సాంబుని గర్భవతి వేషము వేయించి మునుల దగ్గరకు తీసుకొని వెళ్ళి వారితో బభ్రువు భార్యయగు ఈమె గర్భవతి. మీరు దివ్యదృష్టి సంపన్నులు. కనుక ఈమెకు పుత్రుడు కల్గునా? లేక పుత్రికయా? అని ప్రశ్నించిరి. యాదవుల దుర్వ్యవహారము తెలుసుకొని కోపగించిన మునులు ఇతని గర్భం నుండి ముసలము పుట్టును. అదియే శ్రీ కృష్ణుడు బలరాముడు మినహా సమస్త యాదవ వంశనాశమునకు కారణమగునని శపించిరి. బలరాముడు స్వయంగా శరీరము విడిచి సముద్రంలో ప్రవేశించును. శ్రీ కృష్ణుడు నేలమీద పరుండి యుండగా జరయను పేరుగల కిరాతుడు ప్రయోగించిన బాణముతో ఈ లోకమును విడిచిపెట్టునని చెప్పి ఋషులు శ్రీ కృష్ణుని వద్దకు వెళ్ళిరి. ఇదంతావిని శ్రీ కృష్ణుడు ఋషుల వచనము ప్రకారమే అంతా జరుగునని చెప్పెను.

మరుసటి రోజు తెల్లవారగానే సాంబుడు రోకలికి జన్మనిచ్చెను. యదువంశీయులు దానిని ఉగ్రసేన మహారాజునకిచ్చిరి. ఖిన్నుడైన రాజు దానిని పొడి పొడి చేయించి సేవకులచే సముద్రమున పారవేయించెను. రాజు తన రాజ్యమున మద్యము తయారు చేయుట నిషేధించెను. రాజాజ్ఞను ధిక్కరించిన వారికి
శూలముపై ఎక్కించుట శిక్షయని ప్రకటించెను. ప్రజలు కూడా భయంతో మద్యమును తయారు చేయకుండుటకు, త్రాగకుండుటకు నియమము చేసుకొనిరి.

**ద్వితీయ అధ్యాయము:- ద్వారకలో భయంకర ఉత్పాతములు :-**

వృష్ణి, అంధక వంశీయులు అనేక భయంకర ఉత్పాతముల ననుభవించిరి. కాలము వికృతమగు పురుష వేషముధరించి అందరి ఇళ్ళలో తిరుగుచు అదృశ్యమగుచుండెను. దానిని చంపుటకు బాణ ప్రహారములు చేయుచు ఎన్నో ప్రయత్నములు చేసిరి. వారి ప్రయత్నములు నిష్ఫలమాయెను. యాదవ వంశ వినాశ సూచకముగా ప్రతిదినము తుఫాను వచ్చుచుండెను. మిక్కిలి పెద్ద పెద్ద ఎలుకలు రహదారులపై యథేచ్ఛగా సంచరించసాగెను. అవి రాత్రి నిద్రపోతున్న మనుష్యుల కేశములు, నఖములు కొఱికి తినెడివి. వారి ఇళ్ళలో రాత్రింబవళ్ళు విశ్రాంతి లేకుండా పక్షులు రొద చేసెడివి. తెల్లటి రెక్కలు, ఎర్రటి పాదములతో గూడిన పావురములు తిరుగు చుండెడివి. ఆవుల వలన గాడిదలు, కుక్కలవలన పిల్లులు, ముంగిసలవలన పిల్లులు పుట్టుచుండెను. ఉదయకాలమున, అస్తమయకాలమున సూర్యుడు కబంధములతో వ్యాపించి కనబడసాగెను. భోజనములో వేలకొలది పురుగులు కనబడసాగెను. శ్రీ కృష్ణుని పాంచజన్యధ్వని కర్ణకఠోరమాయెను. కాల వైపరీత్యమును, త్రయోదశినాడు అమావాస్య ప్రభావమును చూచి శ్రీ కృష్ణుడు మహాభారతయుద్ధము నాటి యోగము వంటి యోగమే ఇప్పుడు కనబడు చున్నది. ఇది మన అందరి వినాశమునకు సూచకము. భారతయుద్ధము పూర్తి అయి ముప్పది యారవ సంవత్సరము ప్రారంభమైనది. పుత్రశోకముతో గాంధారి మన కులమునకు ఇచ్చిన శాపము ఇప్పుడు పక్వదశకు రానున్నదని చెప్పి శ్రీ కృష్ణుడు వారిని తీర్థయాత్రలకు ఆదేశించెను.

**తృతీయ అధ్యాయము :- యాదవుల పరస్పరసంహారము:-**

ద్వారక ప్రజలు రాత్రి స్వప్నమున ఒక నల్లటి భయంకర మైన ఆకారము కల్గిన స్త్రీ వారి వారి ఇండ్లలో ప్రవేశించి స్త్రీల సౌభాగ్యసూత్రములను అపహరించుచు వీధులలో తిరుగాడుటను, మనుష్యులను పట్టుకొని తినుటను చూచుచుండిరి. శ్రీ కృష్ణుని సలహా ప్రకారము యాదవ వంశీయులు సపరివారముగా తీర్థయాత్రలు చేయుటకు నిశ్చయించుకొని తినుబండారములను మూటగట్టుకొని ప్రభాస క్షేత్రమునకు వెళ్ళి అక్కడ సముద్ర తీరమున డేరాలు వేసుకొని ఉండిరి. యోగ వేత్తయగు ఉద్ధవుడు వారి

నుండి సెలవు తీసుకొని అచ్చటి నుండి వెడలెను. యాదవులందరూ మత్తుగా త్రాగి నృత్యంచేస్తూ సంతోషంగానుండిరి. మద్యపానముచే ఉన్మత్తుడైన సాత్యకి కృతవర్మను పరిహసించి అవమానించెను. ప్రద్యుమ్నుడు అతనిని సమర్థించెను. కోపగించిన కృతవర్మ ఎడమ చేతితో సైగచేస్తూ సాత్యకిని అవమానించెను. అతడు సాత్యకితో కురుక్షేత్ర యుద్ధమున చేతులు నరకబడి భూరిశ్రవసుడు నేలపైపడగా అట్టి అవస్థలో నీవు అతనిని వధించితివని పరిహసించెను. కోపగించిన సాత్యకి అతనితో నీవు ద్రోణపుత్రునికి సహాయకుడవై రాత్రిసమయమున నిద్రించుచున్న ద్రౌపది పుత్రులను వధించితివి. ఆమార్గమునే నేను కూడా అనుసరించెదనని చెబుతూ శ్రీ కృష్ణుని వద్దకు పరిగెత్తుకుని వెళ్ళి కత్తితో కృతవర్మ శిరస్సును ఖండించెను. అచట వీరులు ఒకరినొకరు చంపుకొనిరి. సాత్యకి ప్రద్యుమ్నులు ప్రతిపక్షుల చేతిలో హతమైరి. వారిద్దరు చంపబడుటను గమనించిన శ్రీకృష్ణుడు క్రుద్ధుడై పిడికెడుగడ్డి ఊడబెరికెను. అది వజ్రమువలె భయంకరమైన లోహపు రోకలి అయినది. శ్రీకృష్ణుడు తనకు ఎదురు వచ్చువారందరిని చంపిపడవేసెను. సాంబుడు మున్నగు తన పుత్రులు చంపబడుటచే కోపగించిన శ్రీ కృష్ణుడు మిగిలిన యాదవులను చంపివేసెను. బభ్రువు, దారుకుడు ఇద్దరు శ్రీ కృష్ణునితో మనం ముగ్గురము బలరాముని వద్దకు వెళ్ళెదమని చెప్పిరి.

**చతుర్థ అధ్యాయము:- బలరామ శ్రీ కృష్ణుల పరమధామగమనము:-**

బభ్రు, దారుక, శ్రీ కృష్ణులు ముగ్గురు బలరాముని జాడ వెదకుచు

బయలుదేరిరి. హాస్తినాపురము వెళ్ళి యాదవుల వినాశ సమాచారమును అర్జునునికి తెలియజెప్పవలసినదిగా దారుకుని ఆజ్ఞాపించెను. దారుకుడు వెడలిన తరువాత శ్రీ కృష్ణుడు స్త్రీలను రక్షించుటకు ద్వారకకు వెళ్ళమని బభ్రువును ఆదేశించెను. ఇంతలో పెద్దముసలము మీద పడుటచే బభ్రువు ప్రాణములను కోల్పోయెను. ద్వారక స్త్రీలను రక్షించు భారమును అప్ప జెప్పుటకు శ్రీ కృష్ణుడు ద్వారకకు వెళ్లే తన తండ్రియగు వసుదేవునికి అప్పగించి తపస్సు చేసుకొనుటకు బలరాముని వద్దకు బయలుదేరి వెళ్ళెను. వనమునకు వెళ్ళి అచ్చట సమాధిలోనున్న బలరాముని చూచెను. బలరాముని ముఖము నుండి తెల్లటి పెద్ద సర్పము బయటకు వచ్చి మహాసాగరము వైపు వెళ్ళి పూర్వ శరీరము విడిచి సహస్రశిరస్సులు కల ఆది శేషునిగా ప్రత్యక్షమాయెను. దివ్యసర్పములు ఆది శేషునకు స్వాగతము పలికినవి. బలరాముడు పరమధామమునకు వెళ్ళిన తరువాత శ్రీ కృష్ణుడు ముల్లోకములను రక్షించుటకు, దుర్వాసుని వచనపాలన కొఱకు పరమధామమునకు వెళ్ళు సమయము ఆసన్నమైనదని తెలుసుకొని నేలపై పరుండెను. జరయను ఒక కిరాతుడు శ్రీ కృష్ణుని మృగమని భ్రాంతి పడి బాణముతో అతని పాదమును గాయపరచెను. మృగమును పట్టుకొనుటకు దగ్గరకు వచ్చి శ్రీ కృష్ణుని చూచి మిక్కిలి భయపడి భగవంతుని శరణువేడెను. దేవగణము, ఋషిగణము స్వాగతము పలుకగా శ్రీ కృష్ణుడు వైకుంఠమునకు వెడలెను.

**పంచమ అధ్యాయము:-- అర్జునుడు ద్వారకయందు శ్రీ కృష్ణుని భార్యల దుఃస్థితి చూచి దుఃఖించుట:-**

దారుకుడు మౌసల యుద్ధమున యాదవుల నాశసమాచారమును పాండవులకు తెలియజేసెను. అర్జునుడు కృష్ణుని కలియుటకు దారుకునితో ద్వారక వెళ్ళెను. అనాథ స్త్రీవలె ద్వారక శోభాహీనముగానున్నది. శ్రీ కృష్ణుడు లేక పోవుటచే అతని పదహారు వేలమంది స్త్రీలు అనాథలై అర్జునుని చూచి విలపించిరి. సత్యభామ, రుక్మిణి మున్నగు రాణులు కూడా అక్కడకు వచ్చి రోదించిరి. వారిని ఓదార్చి అర్జునుడు వసుదేవుని కలియుటకు వెడలెను.

**ఆరవ అధ్యాయము:-- అర్జున వాసుదేవుల సంభాషణ:-**

పుత్రశోకముచే సంతప్తుడైన వసుదేవుని చూచి అర్జునుడు మిక్కిలి దుఃఖించి మామ కాళ్ళపైపడెను. వసుదేవుడు అర్జునుని లేవనెత్తి కౌగలించుకొని తన పుత్రులను స్మరించుకొని విచారిస్తూ రోదించెను. సాత్యకి ప్రద్యుమ్నుల దుర్వ్యవహారముచే వృష్ణివంశమంతయు నాశనమైనదని చెప్పెను. యాదవులందరు ఒకరినొకరు చంపుకొని మరణించగా వారి దురవస్థను చూచి శ్రీ కృష్ణుడు వసుదేవుని వద్దకు వచ్చి వృష్ణివంశనాశమును చెప్పి అర్జునుడు నీదగ్గరకు రాగలడు. యాదవనాశము అతనికి చెప్పవలసినది. స్త్రీలు, పిల్లలను రక్షించుటలో అర్జునుడు విశేష దృష్టి పెట్టవలసినది. అతడే మీకు ఔర్ధ్వదేహిక సంస్కారములను చేయును. అర్జునుడు ద్వారకనుండి వెడలగానే తత్కాలమున ద్వారక సముద్రమున మునిగిపోవును. నేను బలరామునితో కూడా ఉంటూ పరమధామమునకు వెళ్ళు సమయమును నిరీక్షించెదను ఈ సందేశమును అర్జునునికి తెలియజేయమని శ్రీ కృష్ణుడు వసుదేవునికి చెప్పెను. వసుదేవుడు అర్జునునికి సందేశము వినిపించి పార్థ! శ్రీ కృష్ణుని ఆజ్ఞను పాలించుము. నిశ్చింతగా నేను ప్రాణములను విడిచి పెట్టెదనని పలికెను.

**ఏడవ అధ్యాయము:- సముద్రమున ద్వారకాపురి మునుగుట:-**

వసుదేవుని మాటలు విని అర్జునుడు మిక్కిలి దుఃఖించి ఇట్లు పలికెను. యుధిష్ఠిరుని పరలోక గమనమునకు సమయము ఆసన్న మైనది. నేను వృష్ణి వంశస్త్రీలను, పిల్లలను, వృద్ధులను ఇంద్రప్రస్థము తీసుకొని వెళ్ళెదను. ఇంద్రప్రస్థము వెళ్ళిన తరువాత శ్రీ కృష్ణుని పౌత్రుడు వజ్రుడు మీకు రాజు కాగలడు. ప్రయాణమునకు ఏర్పాట్లు చేయండి. ఏడవ రోజు ఉదయము ఇచ్చటినుండి వెళ్ళెదమని చెప్పి అర్జునుడు ఆరోజు రాత్రి శ్రీ కృష్ణుని భవనమున విశ్రమించెను. ఉదయము కాగానే వసుదేవుడు ఇంద్రియ నిగ్రహము ద్వారా ఉత్తమగతిని పొందెను. అర్జునుడు అతనికి దహనసంస్కారములు గావించెను. వసుదేవునితో కూడా అతని నల్గురు భార్యలు దేవకి, భద్ర, రోహిణి, మదిరలు కూడా సహగమనము చేసెరి. పిమ్మట ఆప్తులద్వారా శ్రీ కృష్ణబలరాముల పార్థివ శరీరములను వెదికించి అర్జునుడు వారికి కూడా సంస్కారముగావించెను. పిమ్మట ఏడవరోజున అర్జునుడు అందరితో ద్వారకనుండి ఇంద్రప్రస్థమునకు బయలుదేరెను.

అర్జునుడు ద్వారకలోని ఏయేభాగము విడుచుచు ముందుకు సాగెనో ఆయాభాగము సముద్రములో మునిగి పోవుచుండెను. మార్గమధ్యమున కొందరు దొంగలు వారిపై ఆక్రమించి కొందరు అందమైన స్త్రీలను ఎత్తుకొనివెళ్ళిరి. అర్జునుని ధనుర్విద్య నిష్ఫలమాయెను. ఇదంతా దైవనిర్ణయమని తలచి అర్జునుడు మిగిలిన జనులతో ఇంద్రప్రస్థము చేరెను. అతడు సాత్యకి పుత్రుడు యౌయుధానిని సరస్వతీ నదికి సమీమందలి దేశమునకు అధికారిగా, వజ్రుని ఇంద్రప్రస్థమునకు రాజుగా చేసెను. రుక్మిణి, గాంధారి, శైవ్య, హైమవతి, జాంబవతులు అగ్నిప్రవేశము చేసి పరలోకమునకు పొందిరి. సత్యభామ, మిగిలిన రాణులు తపస్సునకై వనమునకు వెళ్ళిరి. ఈవిధముగా యథోచితవ్యవస్థచేసి అర్జునుడు వ్యాసమహర్షి ఆశ్రమమునకు వెళ్ళెను.

**ఎనిమిదవ అధ్యాయము:- వ్యాసార్జునుల సంభాషణ:-**

వ్యాసాశ్రమము చేరి అర్జునుడు ఏకాంతమున కూర్చునియున్న మహర్షిని చూచి అతని వద్దకు వెళ్ళి నమస్కరించెను. వ్యాసుడు అర్జునుని మానసిక ఆందోళనకు కారణమడుగగా అతడు  మహర్షీ! శ్రీ కృష్ణుడు బలరామునితో అతని పరమధామమునకు వెళ్ళిపోయెను. మౌసల యుద్ధమున వృష్ణి వంశము నశించినది. దారికాచి ఆక్రమించిన దొంగలనుండి అనాథ స్త్రీలను నేను కాపాడలేక పోతిని. నా అస్త్రజ్ఞానము లుప్తమైనది. వాసుదేవుడు లేకుండా నేను ఒక్కక్షణము కూడా జీవించలేను. శుభమును ఉపదేశింపుడని ప్రార్థించెను. వ్యాసుడు అర్జునునితో కుమారా! సమస్త యదువంశము దేవతల అంశమే. వారంతా శ్రీ కృష్ణునితో ఇక్కడకు వచ్చి తిరిగి వారితో వెళ్ళిరి. వారిని గూర్చి శోకించుట తగదు. వాసుదేవుడు సాక్షాత్తు చతుర్భుజ నారాయణుడు. భూభారమును తొలగించి తిరిగి వారు స్వస్థానమునకు వెడలిరి. మీరంతా మీకర్తవ్యమును పాటించవలసినది. మీకు కూడా పరలోకగమనమునకు సమయము ఆసన్నమైనది. సృష్టికాలమువలన మనుష్యుని బుద్ధి, తేజస్సు, జ్ఞానము వికసించును. విపరీత కాలమున అవన్నియు నశించును. ఉత్పత్తి సంహారములకు కాలమే కారణము. నీ అస్త్రశస్త్రముల ప్రయోజనము పూర్తి అయినది. కనుక ఏవిధముగ వచ్చినవో ఆవిధంగా వెడలి పోయినవి. మీ అందరికి ఉత్తమలోకప్రాప్తికి సమయము

ఆసన్నమైనది. ఇదే మీ అందరికి జరుగు శుభమని ఉపదేశించెను. అర్జునుడు వ్యాసుని ఆజ్ఞను పొంది హస్తినాపురమునకు వెడలి జరిగినదంతయు యుధిష్ఠిరునికి చెప్పెను.

**ఇది మౌసలపర్వ కథాంశము.**